బాలికల పాఠశాలకు ఉచితంగా నీరు సరఫరా

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి కస్తూరిబా బాలికల పాఠశాలకు సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు తంగి రమణ తన సొంత డబ్బులతో ఉచితంగా మంచినీటిని సరఫరా చేశారు. గత నెల 20 నుంచి ఆ పాఠశాలకు నీరు సరఫరా లేకపోవడంతో తన సొంత డబ్బులతో ట్యాంకర్లు సమకూర్చి ఈనెల 20వ తేదీ వరకు ఉచితంగా మంచినీటి సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు ఉచితంగా నీటి సరఫరా చేసిన తంగిరమునకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఔదార్యం... ఆక్రమణ కట్టడాల మీద ఉదాసీనత

సీపన్నాయుడు పేట వద్ద వెలసిన నిర్మాణం ప్రస్తుత పరిస్థితి


పెయ్యలవానిపేట వద్ద సర్వే నెంబర్ 97లో వెలిసిన నిర్మాణం

కార్పొరేషన్ సిబ్బంది వివరణ ఇచ్చిన దానిలో అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగర పాలక సంస్థ పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనుమతి తప్పని సరి. అన్ని ఉన్నా కొన్ని కొర్రీలు పెట్టే టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం ఆక్రమణ కట్టడాల మీద ఉదాసీనత చూపి వారి ఔదార్యం ఆక్రమణ ఆసామీల మీద చూపుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పేద వాడు ఇల్లు కట్టాలి అంటే చాలా అనుమతులు ఉండాలి కానీ ఆర్థిక, అంగ బలం ఉన్నవారికి మాత్రం అది పెద్ద పనికాదని సామాన్యుల ఆవేదన. అక్రమ నిర్మాణాల మీద వార్తా పత్రికల్లో కథనాలు వస్తె వాటి మీద పై అధికారులకు ఇచ్చే వివరణలో కూడా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఔదార్యం కనిపిస్తుంది. పాత ఫోటోలు జత చేసి చర్యలు తీసుకున్నామని అధికారులకు నివేదిక ఇస్తూ అక్రమ నిర్మాణాలు మీద వారి ప్రత్యేక సానుభూతి చూపుకుంటున్నారని కొందరు అనుకుంటున్నారు. ఆక్రమణ నిర్మాణ దారులకు త్వరగా ఇల్లు పూర్తి చేయండి ఎవరైనా అడిగితే తూతూ మంత్రంగా నోటీసులు ఇస్తాం మీరు త్వరగా ఇల్లు పూర్తి చేసి గృహప్రవేశం చేసేసుకుంటే న్యాయస్థానం కి వెళ్లి స్టే తెచ్చుకుంటే మీ ఇంట్లోనే మీరు స్వేచ్ఛగా ఉండవచ్చని ఉచిత సలహాలు కూడా ఇస్తున్నట్లు విమర్శలు వినపడు తున్నాయి. వార్తా పత్రికల్లో వచ్చే కథనాలకి వివరణ ఇచ్చేటప్పుడు పై అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. శ్రీకాకుళం నగర పాలక సమస్థ పరిధి లో మాత్రం చెరువుల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఏదో తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అక్రమ నిర్మాణదారులు పక్కా భవనాలు పూర్తవుతున్నాయి అంటే అందులో టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది.

- సిబ్బంది పనితనానికి కొన్ని మచ్చు తునకలు... సీపన్నాయుదు పేట పరిధిలో గతంలో చెరువును కప్పి అక్కడ పక్కా భవనం నిర్మిస్తే టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. నిర్మాణదారుడు న్యాయస్థానం కి వెళ్లి స్టే తీసుకొచ్చారు. అప్పటికి అక్కడ ఉన్నది ఒకటే ఫ్లోర్. ఇప్పుడు అదే భవనం రెండో ఫ్లోర్ పూర్తి చేసుకుని చివరి దశకు వచ్చింది. ఈ మధ్య కార్పొరేషన్ సిబ్బంది నోటీసులు ఇస్తే మళ్లీ నిర్మాణదారుడు స్టే తెచ్చుకున్నాడని సిబ్బంది చెబుతున్నారు. ఈ పరిస్థితికి కారణం ఎవరు అనేది అధికారులే చెప్పాలి.

అలాగే నగర కార్పొరేషన్ ఫాజుల్ బ్యాగ్ పేట వార్డు పరిధి పెయ్యలవాని పేట దారిలో సర్వే నెంబర్ 97 లో అక్రమ నిర్మాణం జరిగి చివరి స్టేజ్ కి వచ్చింది. దీని మీద అధికారులకు వివరణ అడిగితే అది చెరువు అని, దీని మీద రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాలంటున్నారు. అలాంటప్పుడు ఒక్క రాత్రికి రాత్రే ఇంత భవనం ఆ నిర్మాణ దారుడు కట్టాడా లేక అధికారుల అలసత్వమా అనేది ఆ దేవునికే తెలియాలి. అక్రమ నిర్మాణాల మీద చర్యలు తీసుకొని, నగర కార్పొరేషన్ కు ఆదాయం వచ్చేలా టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యవహరించాలని అప్పుడే నగరాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

అమరులైన జవానులకు నివాళులర్పించిన ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-టెక్కలి : భారతదేశ సరిహద్దులలో జవాన్లుగా ఉన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన డొక్కరి రాజేష్, సనపల జగదీశ్వర రావు లు ఉగ్రవాదుల దాడిలో మరణించడం చాలా బాధాకరమైన విషయమని, మరణించిన జవాన్లకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో టెక్కలి మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, అధ్యక్షులు గోరు వాసు లు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన జవాన్లు సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన డొక్కరి రాజేష్, నందిగాం మండలం వల్లభరాయుడు పేట గ్రామానికి చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబాలకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, చనిపోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అలాగే వాళ్ల కుటుంబంలో ఉన్న వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశ జవానుల పై జరుగుతున్న ఉగ్రదాడులపై పూర్తిస్థాయిలో కేంద్ర హోం శాఖ మంత్రి బాధ్యత వహించాలని మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. ఈ సంఘటన పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మరణించిన జవాన్లకు పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ ఏఐవైఎఫ్ నాయకులు కిరణ్, ప్రేమ్ చంద్, సాయికుమార్, మౌళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కోసం కూరాకులవీధి ప్రజలు ఆందోళన

విశాలాంధ్ర-జలుమూరు : ఒకనాటి సమితి కేంద్రం నేడు మండల కేంద్రం సారవకోట కూరాకుల వీధిలో త్రాగునీటి కోసం ప్రజలు పడుతున్న బాధలు వర్ణాతీతం, మారుమూల గ్రామాల సైతం ఇంటంటా త్రాగునీరు అందే ఈ రోజుల్లో ఇటువంటి మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ప్రక్కన గల కూరాకుల వీధిలో త్రాగునీరుకు బాధలు పడుతున్నామని అక్కడ ప్రజలు వాపోతున్నారు. వీధి మొత్తం రెండు బోర్లు ఉన్నాయని ఈ బోర్లు పొరపాటున పని చేయకపోతే తాగునీటి కోసం పడిన కష్టాలు అన్ని ఇన్ని కావని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సారవకోట బజారు నుండి దిగువకు పంపు వాల్వ ఉందని దానిని ఓపెన్ చేస్తే దిగువ ప్రాంతమైన కూరాకుల వీధికి పుష్కలమైన త్రాగునీరు అందుతుందని ప్రజలు తెలియజేస్తున్నారు. అధికారులు పరిశీలించి త్రాగునీరు సమస్య పరిష్కరించాలని మీరు కోరారు.

విలీన గ్రామాల్లో మంచి నీటి సరఫరాకు రూ.106 కోట్లు

- మిర్తి బట్టి ఆధునీకరణకు రూ.40 కోట్లతో రీటెండర్లు
- రూ. 30 కోట్లతో సీవేజ్ ప్లాంట్ పూర్తికి ప్రణాళికలు
- మున్సిపల్ కార్పొరేషన్ సమీక్షలో ప్రత్యేక అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరాభివృద్ధికి సాధ్యమైనన్ని ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో రూ. 106 కోట్లతో మంచి నీటి సరఫరా పనులను ప్రతిపాదించామని వీటికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని, మొదటి దశలో పాత్రునివలస, పెద్దపాడు గ్రామాలలో రూ.24 కోట్లతో ఇంటింటికి మంచి నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు సిద్ధం చేశామని చెప్పారు. అలాగే రానున్న మూడు నెలల్లో నగరపాలక సంస్థ మొత్తం డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తామని, అందరూ భాగంగానే మిర్తిబట్టికి రూ.40 కోట్లతో పనులకు రీటెండర్లు పిలవడం, సీవేజ్ ప్లాంట్ రూ. 30 కోట్లతో తిరిగి పనులు ప్రారంభిస్తామన్నారు. పారిశుద్ధ నిర్వహణ శత శాతం పక్కాగా జరగాలని, డ్రైనేజీల నుంచి పూడిక తొలగింపు విషయంలో అలసత్వం వద్దని, 20 టన్నుల సామర్థ్యం గల మూడు టిప్పర్లను ఏర్పాటు చేసి, చెత్తను కాపులుప్పాడ పవర్ ప్లాంట్ కు తరలించాలని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రైవేటు సైట్ల యజమానులకు నోటీసులు పంపించి పొదలు తొలగించాలని, వాటికి ప్రహరీలు కట్టించుకునేలా ప్రోత్సహించాలని, ఖాళీ సైట్లకు పన్ను వసూలు చేయాలని చెప్పారు. ప్రాపర్టీ పన్ను మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని, నీటి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేసి అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నగరపాలక సంస్థకు ప్రతిరోజూ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే వారికి, సిటీజన్ చార్టర్ ప్రకారం పని వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. శ్రీకాకుళం నగర సుందరీకరణ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు, విహారానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సమీక్షలో కమిషనర్ చల్లా ఓబులేసు, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకర రావు, మున్సిపల్ ఇంజనీర్ గంగాధరరావు, ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవిన్యూ తదితర సిబ్బంది హాజరయ్యారు.

పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్

విశాలాంధ్ర-మందస: పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు ఖచ్చితంగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. మండలం మధ్య గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి వైరస్ వలన వస్తుందని, వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, శరీరమంతా నొప్పితో కూడిన కణతలతో పాటు పుండ్లు ఏర్పడి పాలు దిగుబడి కూడా తగ్గుతుందని అన్నారు. మండలంలో 12,400 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని పాడి రైతులు ఈ టీకాలను తమ సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, హరికృష్ణ పురుషోత్తం తో పాటు పాడి రైతుల డొక్కా లక్ష్మీనారాయణ, మాధవరావు, రామకృష్ణ, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం నవతల లెవెన్ కె.వి 24 హార్స్ ఫీడర్‌పై శుక్రవారం మరమ్మతులు చేస్తున్నందున ఆరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జీ రమేష్ తెలిపారు నవతల గ్రామం జంక్షన్ దాసుపురం బొంతు నారాయణపురం వివిధ గ్రామాల్లో సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శంకర్రావు ఆదేశాలమేరకు ఈ మరమ్మత్తు చేపడుతున్నట్లు తెలిపారు.

టెక్కలి: మండలంలో ఉన్న విద్యుత్ వినియోగ దారులకు ముఖ్య విజ్ఞప్తి 11 కేవీ లింగలవలస ఫీడర్ పై వార్షిక మరమ్మత్తుల నిమిత్తం ఉదయం గం.08:00 నుండి మధ్యాహ్నం గం.02:00ల వరకు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగు తుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శంకరరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సీతాపురం, తెర్లంగి, పోలవరం, పెద్దసాన, లింగల వలస గ్రామాలలో విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శంకరరావు కోరారు.

సోంపేట : సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీని వలన సోంపేట, జింకిభద్ర, బెంకిలి మరియు 11 కెవి కొర్లాం రూరల్ ఫీడర్ బ్రాహ్మణకొర్లాం, నూకలూరు, పాలవలస, కర్తలిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కవిటి : మండలంలోని 11 కెవి భైరిపురం ఫీడర్లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్, ఏఈ నేతాజీ తెలిపారు. 11కెవి లైన్ మైంటెనెన్స్ పనులు, చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో భైరిపురం, డి.జి. పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి: ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన నెలవంక గ్రామానికి చెందిన దుర్గాశి శ్యామల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయింది. విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు శ్యామలకు 5 వేల రూపాయలు నగదు తో పాటు నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులను మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారి నుండి విద్యార్థి, యువతను కాపాడాలి : ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-టెక్కలి: అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం టెక్కలి మండల కేంద్రంలో అఖిలభారత యువజన సమాఖ్య టెక్కలి నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంగా జరుగుతున్న మత్తు పదార్థాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరా గాంధీ కూడలి వద్ద ర్యాలీ, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావు లు మాట్లాడుతూ అనేక ప్రాంతాల నుండి మత్తు పదార్థాలు, గుట్కా, ఖైనీ వ్యాపారాలు కొనసాగుతున్నయని వాటిని నిలువరించడంలో ప్రభుత్వ అధికారులు, పోలీసు వ్యవస్థ జాప్యం చేస్తున్నాయని అన్నారు. భారతదేశంలో యువత ఎక్కువ మంది ఉన్నప్పటికీ ఈ మత్తు పదార్థాల ద్వారా దేశంలో ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యక్తులకు పోర్టులు అప్పగించి ఆ పోర్టుల ద్వారా డ్రగ్స్, హెరాయిన్, కొకాయిన్ లాంటి మత్తు పదార్థాలు దేశవ్యాప్తంగా యువత వద్దకు చేరే విధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని వారన్నారు. తక్షణమే జరుగుతున్న మత్తు పదార్థాల వ్యాపారాన్ని, గుట్కా, ఖైనీ అమ్మకాన్ని నిషేధించాలని లేనియెడల అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యక్ష, పరోక్ష పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పూర్తి సంఘీభావం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, ఏఐవైఎఫ్ నాయకులు ప్రేమ్ చందు, కిషోర్, గురుమూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి

- ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణమూర్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస: తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులందరికీ 15 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటనలను స్వాగతిస్తున్నామని, ఆ పథకం అమలుకు ప్రభుత్వం పునరాలోచ న చేయాలని ఎస్ టి యు జిల్లా శాఖ అధ్యక్షులు ఎన్ని రమణ మూర్తి కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో చదువుతున్న పిల్లందరికీ తల్లికి వందనం పేరిట 15 వేల రూపాయలు ఇస్తామన్న మన విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రకటనను స్వాగతిస్తున్నామని అయితే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలనీ లేకుంటే రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగుకానున్నాయని ఆవేదన చెందారు. దీంతో బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరం కానున్నారని ఇది ఎంత మాత్రం ప్రభుత్వానికి తగదని ఎస్ టి యు ప్రతినిధులు ప్రభుత్వానికి హితవు పలికారు. గురువారం శ్రీకాకుళం రూరల్ మండలంలో ఎస్ టి యు సభ్య త్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఖాజీ పేట లో మాట్లాడుతూ ఉద్యోగు లకు గడిచిన ఐదు సంవత్సరాలు గా రావాల్సిన పెండింగ్ బకాయిల ను విడుదల చేయాలని, పన్నెండవ వేతన సవరణ కమీషన్ నియమించి మెరుగైన ఐఆర్ ప్రకటించాలని, పాత పింఛన్ల విధానాన్ని అమలు దిశగా చర్యులు తీసుకోవాలని అన్నీ పాఠశాలలో ఇద్దరు టీచర్లకు తక్కువ కాకుండా చూ డాలని, ఇంగ్లీష్ మీడియం కు సమాంతరంగా తెలుగు మీడియం ను కొనసాగించాలని, ఉపా ధ్యాయులపై యాప్ ల భారం తొలగించాలని, నెలవారీ పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతాడ సూర్యారావు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చింతల రామా రావు బొడ్డేపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ తప్పనిసరి

విశాలాంధ్ర-కవిటి : గ్రామ, వార్డు సచివాలయాలలో ఈనెల 23 నుండి 27 వరకు చేపడుతున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డి.ఎల్.డి.ఓ చల్లా అలివేలు మంగమ్మ సూచించారు. ఈమేరకు గురువారం మండలంలోని కవిటి సచివాలయం1, కుసుంపురం సచివాలయంలలో జరుగుతున్న ఆధార్ నమోదు కేంద్రాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసిందని కావున అందరూ ఆధార్ నవీకరణ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. 0-5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్ నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు బయోమెట్రిక్ నవీకరణ, ఆధార్ కార్డు పొంది 10 సంవత్సరాలు దాటిన వారు వారి నివాస ధ్రువీకరణ పత్రం నవీకరణ (డాక్యుమెంట్ అప్డేషన్),ఆధార్ కు సెల్ నంబరు జోడింపు వంటివి తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.లేని పక్షంలో ఆధార్ ద్వారా పొందే అన్నిరకాల పౌరసేవలకు, ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నిర్లిప్తత వీడి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆధార్ నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలని చెప్పారు.మాణిక్యపురం సచివాలయంలో నిర్వహిస్తున్న సేవలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి, ఈవో వీరభద్రస్వామి, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం - ప్రాణాంతకం...

టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ హెచ్ ఆర్ తేజ చక్రవర్తి మల్ల

విశాలాంధ్ర-టెక్కలి: హెల్మెట్ లేని ప్రయాణం - ప్రాణాంతకం అని, ప్రతీ ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల తెలియజేసారు. ఈ సందర్భంగా గురువారం టెక్కలి మండలంలోని రావివలస కూడలిలో, ధర్మనీలాపురం గ్రామ కూడలిలో మరియు తలగాం గ్రామ కూడలి వద్ద న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు కూడా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని అలాగే ప్రతి ఒక్కరు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సదస్సు లో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డివి వివేకానంద, ప్యానెల్ న్యాయ వాది పి మధుబాబు, న్యాయవాదులు పి బాబురావు, పి సాయిరాజ్, కె ఈశ్వరరావు, టెక్కలి ఎస్ఐ వి వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో ఆర్‌డిఓ భరత్‌నాయక్ పర్యటన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలంలో వివిధ సమస్యలపై పలాస ఆర్‌డిఓ భరత్‌నాయక్ గురు వారం పరిశీలించారు. గొల్లవూరు, రామయ్య పట్నం గ్రామాల్లో తహశీల్దార్ విజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆర్‌డిఓ పర్యటించారు. ముందుగా గొల్లవూరు సమీపంలో మహేంద్రతనయ నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల వలన సముద్రపు ఉప్పునీరు చొచ్చుకు రావడం ఉద్దానం మంచినీటి పథకానికి ముప్పుగా మారుతుందని ఇటీవల మండల సాధారణ సమావేశంలో గొల్లవూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు సమస్యలు లేవనెత్తిన విషయం తెల్సిందే. దీనిపై ఆర్‌డిఓ పరిశీలించి నదిలో అక్రమ తవ్వకాలు జరిగితే సహించవద్దని వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అలాగే గొల్లవూరు, రామయ్యపట్నం గ్రామాల్లో తుపాన్ రక్షిత భవనాలను పరిశీలించారు.

ఇంచార్జ్ ఆర్డీవోగా సుదర్శన్ దొర బాధ్యతలు

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో ఇంచార్జ్ ఆర్డిఓగా సుదర్శన్ దొర గురువారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే జరిగిన ఐఏఎస్ అధికారులు బదిలీలలో టెక్కలి సబ్ కలెక్టర్‌గా ఉన్న నూరుల్‌కమర్‌కు డిప్యూటీ సెక్రటరీ గవర్నమెంట్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సుదర్శన దొర నూతనంగా బాధితులు చేపట్టారు. ఈ సందర్భంగా టెక్కలిలోని పలు శాఖల అధికారులతోపాటు టిడిపి మండల అధ్యక్షులు బాగాది శేషగిరి ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎన్.ఎస్.టి.పి ప్లాంట్‌కు వ్యతిరేకత

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో గల 18వ వార్డులో ప్రజా ఉపయోగానికి కేటాయించి పట్టా జారీ చేసిన స్థలం స్థానికుల ఆధీనంలో ఉన్న స్థలంలో కొత్తగా మురికి నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చర్యలు విరమించుకోవాలని రత్తకన్న గ్రామస్తులు కోరుతున్నారు. అక్కడ ప్లాంట్ నిర్మాణం పట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్, ఉపతహశిల్దార్ గురుప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేసారు. సర్వే నెం. 430/2లో 0.36సెంట్లకు శ్రీ వినాయక యువజన సంఘం, సంతోషం వీధి పేరున పట్టాను రెవిన్యూ అధికారులు జారీ చేసారని, గ్రామంలో శుభకార్యాలు నిర్వహించుకోడానికి వినియోగిస్తున్నామని, కళ్యాణ మండపం నిర్మించుకోడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నామని, ఇప్పుడు ఆ స్థంలో మురికి నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుకు పూనుకోవడం విచారకరమని, వేరొక స్థలంలో అటువంటి ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేసారు. వార్డు కౌన్సిలర్ చిడిపోతు జగన్నాయకులు, న్యాయవాది గిన్ని సీతయ్య, పితాంబర్, బాలరాజు, చంద్రశేఖర్, భీమయ్య, ఆర్.దేవరాజు తదితరులు వినతిని అందించిన వారిలో ఉన్నారు.

లక్కివలసలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం లక్కీవలసలోప్రణదాత బ్లడ్ బ్యాంక్ వారి ఆద్వర్యం లో మెగా రక్తదానం శిబిరము గురువారము జరిగింది. అమెరికా లో నివాసం ఉంటున్న చిన్నారి సోనియా పుట్టిన రోజు సందర్భంగా శ్రీ కృష్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకులు రచూరి సునీతా ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు దుపాన రమణారెడ్డి మాట్లాడుతూ అన్ని దానాలలో రక్తదానం గొప్పదని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని కోరారు. ఈ శిబిరంలో 35 యూనిట్ల రక్తం సేకరించినట్లు కార్య నిర్వాహకులు మన్మదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుమిత్ర సేవా ఫౌండేషన్ (టెక్కలి)వ్యవస్థాపకులు కోరాడ రాంప్రసాద్ మాజి ఎంపిపి దర్మార్జున రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు,మాజీ ఎంపీటీసీ శ్రీర%శీ%గం యర్రయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు సూరాడ ధనరాజ్, పిట్ట రాజులు, దూపాన రామారావు, దుపాన కృష్ణారావు, చిట్టి బారికి లింగరాజు, మామిడి రవి తేజ (నవతరం), కార్య నిర్వాహకులు పట్నాన మన్మదరావు, (శ్రీ మహాలక్ష్మీ మెడికల్ స్టోర్), ఉమ్మడి గోవింద రెడ్డి, బుద్దెపు ఢిల్లేష్, పనపాన తాతయ్య, మంకు కర్రెయ్య, శ్రీరంగం కోర్లయ్య, మంకు ధనుంజయ్ రావు, పాల్గొన్నారు.

ఎరువుల బస్తాలు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలము లక్కివలస సచివాలయంలో గురువారము రైతులకు ఎరువులు బస్తాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్ట రాజులు, చిదపాన ధర్మార్జున రెడ్డి, శ్రీరంగం రాజులు, దూపాన కృష్ణరావు, దూపాన రామారావు, రైతులు పాల్గొన్నారు.

28న జెడ్.పి.స్థాయి సంఘ సమావేశాలు

జిల్లా పరిషత్ సిఈఓ వెల్లడి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీచేశారు. ఆదివారం 28న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గం.లకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10.00 గం.లకు 2వ స్థాయి, 11.00 గం.లకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12.00 గం.లకు 1వ స్థాయి సంఘం సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1.00 గం.లకు 7వ స్థాయి, 3.00 గం. లకు 6వ స్థాయి, సాయంత్రం 4.00 గం.లకు 3వ స్థాయి, సాయంత్రం 5.00 గం.లకు 5వ స్థాయి సంఘ సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

షిరిడీసాయి మందిరంలో అన్నసమారాధన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువలో గల షిరిడిసాయి మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. సంఘ సేవకురాలు సీపాన గుణవతి తన తండ్రి ఢిల్లీరావు మాస్టారు ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నసమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-సోంపేట: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న డిఎపి ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సోంపేట పిఎసిఎస్ ముఖ్య కార్య నిర్వహణాధికారి నారాయణ రావుతో పాటు స్థానిక టీడీపీ నాయకులు కోరారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శేఖర్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, డిసిసిబి చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తల్లికివందనం వర్తింప చేయటం హర్షదాయకం

ఆప్సా గౌరవధ్యక్షులు ప్రతాప్

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ప్రైవేట్ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులకు సైతంకు తల్లికి వందనం పథకం వర్తిస్తుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడం పట్ల నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘ గౌరవధ్యక్షులు జె.జె.ఎస్. ప్రతాప్ హర్షదాయకమన్నారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామి మేరకు ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా తల్లికి వందనం వర్తిస్తుందని గౌరవ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ వారు బుధవారం జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రకటించడం హర్షదాయకమాన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నడపబడుతున్న బడ్జెట్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం ఎంతో మేలు చేసినట్లు అవుతుందని, అలాగే బడ్జెట్ స్కూల్ మనుగడకు ఎంతో మేలు కాగలదని మెళియాపుట్టి మండలం లోగల ప్రవేటు స్కూల్ కరస్పాండెంట్లు, డైరెక్టర్లు ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గురువారం నాడు మండల కేంద్రంలో గల నలంద పబ్లిక్ స్కూల్లో జరిగిన ఈ సమావేశంలో ప్రైవేట్ సంస్థల కరస్పాండెంట్లు జె.జె.యస్. ప్రతాప్ తోపాటు కలమట శేఖర్, నల్లకాంతం చిన్నిక్రష్ణ, సుగ్గు ప్రసాదరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు పట్ల అవగాన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు బ రాటం కామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో యం ఈ ఓ లు బి. చిన్నవాడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల మహాసభకు ఆహ్వానాలు

విశాలాంధ్ర-పలాస: పలాసలో ఈ నెల 28న ఏపీయూడబ్ల్యూజే 31వ జిల్లా మహాసభలు పలాస కాశీబుగ్గ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీ చైర్మన్ బల్ల గిరిబాబుకు ప్రెస్ క్లబ్ సభ్యులు ఆహ్వాన పత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, కాశీబుగ్గ డిఎస్పి జి నాగేశ్వర రెడ్డి లకు కూడా ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు డి.మహరణ,సిహెచ్ జగదీష్, శివ జ్యోతి,నేతాజీ,జయంత్, బోస్, సురో, కిషోర్, నాగరాజు లు పాల్గొన్నారు.

నేడు నూతన జె సి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్ గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం బదిలీపై జిల్లాకు చేరుకున్నారు. అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహించి బదిలీ పై వచ్చిన ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలెక్టర్ బంగ్లాలో గౌరవ పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో భాద్యతలు స్వీకరించనున్నారు.

ఉచిత గ్యాస్ పథకం తెచ్చిన తంటా...!

గ్యాస్ సిలెండర్‌లు ఎత్తుకు పోతున్న కేటుగాళ్లు

విశాలాంధ్ర-టెక్కలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలెండర్‌లు పథకాన్ని కొందరు కేటుగాళ్లు దొంగతనాలకు ఉపయోగిస్తున్నారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న వృద్ధులను ఏమార్చి గ్యాస్ సిలెండర్ లు ఎత్తుకు పోతున్నారు. ఉచిత గ్యాస్ పథకం మీకు వస్తుంది అని కాళీ గ్యాస్ సిలెండర్ ఇవ్వండి కొత్తది ఇస్తాం అని గ్యాస్ సిలిండర్ తెచ్చాక వివరాలు కోసం ఆధార్, గ్యాస్ కనెక్షన్ నెంబర్ వివరాలు చెప్పండి అని అడగడం తో వాటి కోసం లోపలికి వెళ్లిన తరువాత గ్యాస్ సిలెండర్ తో ఉడాయిస్తున్నారు కేటుగాళ్లు. ఇలాంటి ఘటనే టెక్కలి మండలం నరసింగపల్లి పంచాయతీ కిట్టాలపాడు గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగింది. మరలా అలాంటి సంఘటనే గురువారం నాడు కోటబొమ్మాళి మండలం వింజాంపాడు లో చోటు చేసుకుంది. గురువారం ఉదయం బైక్ మీద వచ్చిన ఇద్దరు యువకులు ఇలా ఒక వృద్దు రాలి నుంచి గ్యాస్ సిలెండర్ తీసుకొని పారిపోయారు. ఇంకా సిలెండర్ తే లేదు అని ఆమె వీధిలోకి వచ్చి చూసే సరికి వారు లేక పోవడం తో మోసపోయిన విషయం తెలిసింది. ప్రజలు ఇలాంటి కేటుగాళ్ల నుంచి జాగ్రత్త గా ఉండాలని అధికారులు చూసిస్తున్నారు. పరిచయం లేని వ్యక్తులు వస్తె తలుపు తీయకూడదని, ఉచిత గ్యాస్ పథకం ఇప్పటి వరకు అమలు కాలేదని, అలా ఎవరైనా వస్తె వారికి వివరాలు ఇవ్వవద్దని చూసిస్తున్నారు. ప్రజల కు ఈ విషయం లో చైతన్యం చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వలువురు కోరుతున్నారు.

బుడంబో పీహెచ్‌సీలో అంబులెన్స్ మంజూరు చెయ్యాలి

సంక్షేమ హాస్టళ్లలో ఆరోగ్య కార్యకర్తలు నియామకం జరపాలి

విశాలాంధ్ర-మందస: మండలం బుడంబో ప్రైమరీ హెల్త్ సెంటర్ కు అంబులెన్స్ మంజూరు చేయాలని, సంక్షేమ హాస్టల్లో ఆరోగ్య కార్యకర్తలు నియమించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ సభ్యులు సవర ధర్మారావు, ఎన్.అప్పన్న లతో మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడంబ పీహెచ్ సి పరిధిలో 75 గ్రామాలు ఉన్నాయని, సుమారు 16 వేల జనాభా ఉండగా రోగుల అవసరార్థం కనీసం అంబులెన్స్ అందుబాటులో లేదన్నారు. ఉన్న అంబులెన్స్ కూడ మరమత్తులు గురైందని వెంటనే మరమత్తులు చెయ్యాలని డిమాండ్ చేశారు. మందస సంక్షేమ బాలురు హాస్టళ్లలో సమస్యలు విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నామని, స్కూల్లో ప్రధానోపాధ్యాయులు, ఇంగ్లీషు, లెక్కలు ఉపాధ్యాయులు లేనందున ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకొచ్చారని తక్షణమే నియామకం చెయ్యాలన్నారు. విద్యార్థులకు గతంలో నాడు-నేడు కార్యక్రమంలో మందస సంక్షేమ హాస్టళ్లలో నిర్మించిన భవనాలు మరమత్తులు గురైందని, వర్షానికి స్లాబ్ పెచ్చులు ఊడి క్లాస్ రూమ్ లో పడుతుండడం తో విద్యార్థులు భయబ్రాంతులకు గురైతున్నారని తక్షణమే మరమత్తులు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ లేనందున వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డైనింగ్ హాల్ నిర్మించాలని, హాస్టళ్లలో విద్యార్థులకు మరుగుదొడ్లు మరమ్మత్తులు గురైందని దీనితో విద్యార్థులు పారిశుద్ధ్య సమస్య ఏర్పడి అనారోగ్యం గురయ్యే అవకాశం ఉందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో 130 మంది ఆదివాసీ విద్యార్థులు చదువుతున్నారని అనారోగ్యం వచ్చిన వారికి ఆరోగ్య సేవలు అందించలేని పరిస్థితి ఉందని, సీజనల్ వ్యాధులు ప్రబలే కాలంలో జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్న పరిస్థితుల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్యకర్తలు నియామకం చేసి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. హాస్టల్‌లో ఒకరే వంట మనిషి ఉండడంతో విద్యార్థులకు ఆహారం అందించడం కష్టంగా ఉంటుందని తక్షణమే ఇద్దరిని నియామకం చెయ్యాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను అందించక తీవ్ర ఇబ్బందులు పడ్డారని కొత్త ప్రభుత్వం విద్యార్థులకు నేరుగా కాస్మోటిక్ చార్జీలను సబ్బులు, నూనె జుట్టు కటింగ్ నిర్వహించాలి కోరారు. విద్యార్థులకు రావల్సిన డైట్ బిల్లులు గత డిసెంబరు నెల నుంచి విడుదల కాలేదని హాస్టల్ నిర్వహణ తీవ్ర బారం పడిందని తక్షణమే విద్యార్థుల డైట్ బిల్లులు విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర పురుషోత్తం,సవర జైరాం పాల్గొన్నారు.

విద్యలో సాంస్కృతిక కళావిద్య అంతర్భాగం చేయాలి

హెచ్ఎం వేణు మాస్టర్

విశాలాంధ్ర-జలుమూరు: శిక్షా సప్తాహ విద్య వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు కెవిఎన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల జలుమూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు ఇప్పిలి వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యలో సాంస్కృతిక కళావిద్య అంతర్భాగం చేయాలని ఆయన అన్నారు. తెలుగు ఉపాధ్యాయుని పల్లి సుశీల విద్యార్థులకు మాతృమూర్తి రాజులమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.2వేలు విలువ చేసే గ్రంథాలయ పుస్తకాలు రూ.3వేలు నగదు పాఠశాల అభివృద్ధికి అందజేశారు.

సారవకోట 108ని ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం సారవకోట 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ బొమ్మాలి హరిప్రసాద్ గురువారం మధ్యాహ్నం ఆకస్మికి తనిఖీచేశారు. అత్యవసర సమయంలో వినియోగించే పరికరాలు పనితీరు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. అత్యవసర సమయంలో మన బాధ్యతగా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

తహసిల్దార్ లక్ష్మి

విశాలాంధ్ర-కవిటి: మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రమైన కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించడానికి అన్ని సంస్థలూ సహకరించాలని కోరారు.అలాగే లైంగిక చర్యలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జి, సీడీపీఓ నాగరాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వి.పల్లవి, జి కృష్ణవేణి, జే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిన్నవయస్సు లోనే విద్యార్థులు భవిష్యత్తు నాశనం చేసుకోవోద్దు

విశాలాంధ్ర-పొందూరు: పిన్న వయస్సులోనే మాదకద్రవ్యాల వినియోగించి చేతులారా విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోరాదని ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్ అన్నారు. స్థానిక సిస్టమ్ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్సు అలవాటుకు దూరంగా ఉండాలని కోరారు. ఇటువంటి వాటికి బానిసగా మారినట్లు అయితే అసాంఘిక కార్యకలాపాలకు అలావాటై జీవితం అందకారంమై పోతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండి ఇటువంటి మాదకద్రవ్యాలు వినియోగం వలన జరిగే నష్టాలను, దుష్పలితాలను గ్రహించాలని కోరారు. ఈయనతో పాటు ఎస్ఐ వెంకటరమణ, కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, హెచ్పీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడివో మృతికి సంతాపం

విశాలాంధ్ర-మెళియాపుట్టి: నరసాపురం ఎంపిడివోగా విధులు నిర్వహిస్తూ ఇటీవల కాలంలో వెంకటరమణ మృతి చెందడంతో స్థానిక మండల పరిషత్ ఉద్యోగులు సంతాపం వ్యక్తంచేశారు. గురువారం మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నరసాపురం ఎంపిడివో వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడివో భాస్కరరావు మాట్లాడుతూ వెంకటరమణ మృతి చెందటం విషాదకరమైన సంఘటనని తెలియజేస్తూనే వారి కుటుంబ సభ్యులు మనో సైర్యంతో ధైర్యంగా ఉండాలని భగవంతుడ్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీడీవోతో పాటు మండల పరిషత్తు ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

ఆ పేర్లు ప్రకటించకుంటే వెంటనే జగన్‌ను అదుపులోకి తీసుకోవాలి

- ప్రభుత్వానికి తెలుగుశక్తి విజ్ఞప్తి
- తమ్మినేని ధర్మాన కుటుంబాల అక్రమాలపై విచారణకు డిమాండ్
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్

విశాలాంధ్ర-ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 36 మంది ప్రాణాలు కోల్పోయారని చెబుతున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి వారి పేర్లు తక్షణమే ప్రకటిం చాలని, లేకుంటే బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి పాతిక లక్షల రూపాయలు చొప్పున చెల్లించాలని తప్పుడు ఆరోపణలు చేసి ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేసినందుకు జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఇతోధికంగా "వరాలు" ప్రకటించిన మరుసటి రోజే ఆంధ్రప్రదేశ్ పరువు తీసే విధంగా దేశ రాజధాని ఢిల్లీ లో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మరోవైపు ప్రా ణాలు కోల్పోయిన 36 మంది పేర్లు చెప్పగలరా? అని జాతీయ మీడియా ప్రతినిధులు ప్రశ్నించినప్పుడు జగన్ నీళ్లు నమిలారన్నా రు. జగన్ కు నిజంగా అంత ప్రేమ ఉంటే ప్రాణాలు కోల్పోయిన ఆ 36 మంది పేర్లను వెంటనే ప్రక టించి బాధిత కుటుంబాలకు 25 లక్షల రూపాయలు చొప్పున చెల్లించాలన్నారు. ఒకవేళ జాబితా ప్రకటించకపోయినా బాధిత కుటుంబాలకి ఆర్థిక సహాయం అందించకపోయినా తప్పుడు ప్రచారం చేసినందుకుగాను వై యస్ జగన్మోహన్ రెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉన్న సమయంలో నారా చంద్ర బాబు నాయుడు పై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. తమ అభిమాన నాయకుడికి ఎదురవుతున్న పరిస్థితుల ను తట్టుకోలేక ప్రాణాలు కోల్పో యిన కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శించడమే కాకుండా ఐదు లక్షల రూపాయలు చొప్పున పరిహారం చెల్లించి ఆ కు టుంబాలని ఆదుకున్న విషయాన్ని బి.వి.రామ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత అరాచక వైసీపీ ప్రభుత్వంలో స్పీకర్ గా పని చేసి.. జగన్నాథ రథచక్రాల లో తాను ఒక చక్రం అంటూ ఊదర గొట్టిన తమ్మినేని సీతారామ్ గాని, ధర్మాన ప్రసాద రావు గాని ఢిల్లీకి వెళ్లలేదన్నారు. శ్రీకాకుళం లో తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసా దరావు కుటుంబాలు వందలాది ఎకరాల భూములను ఆక్రమిం చుకోవడంతో పాటు అనేక అక్ర మాలకు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వీరిద్దరి అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జగన్ వెంట ఉన్న ఆ కొద్ది మంది కూడా మరో మూడు నెలల్లో వైసీపీకి బై..బై చెబుతారని జోశ్యం చెప్పారు. సమావేశంలో పట్టణ టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు ఎన్ని శ్రీదేవి, డాక్టర్ పప్పూర్ నికుంజ్, మెరుగు చరణ్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కుసుంపురం మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ కిట్ పంపిణీ కార్యక్రమం స్థానిక సర్పంచ్ ఊర్మిళ బిసాయి, ఎంపీటీసీ ప్రతినిధి కర్రీ సత్యనారాయణ చేతుల మీదుగా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్, షూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం త్రిలోచన బిసాయి, ఉపాధ్యాయ సిబ్బంది శమల్ల రాజబాబు, సుజాత, హారతి, చంద్రశేఖర్, టీడీపీ, జనసేన కూటమి నాయకులు ఎ.సురేష్ కుమార్, కీలు లోహిదాసు, జుత్తు చలపతి, రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎవ్వరికోసం... ఈ లక్షల ఖర్చు చేసిన ఈ భవనం?

విశాలాంధ్ర-జలుమూరు : కొన్ని సమయాల్లో ప్రభుత్వ అధికారులు పాలకులు చేసిన అభివృద్ధి పనులకు సమాధానం ఉండదని విమర్శలు ఉన్నాయి. ఇదే కోవకు చెందినది సారవకోట మండలం బుడితి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అద్భుతమైన భవనాన్ని నిర్మించారు. ఇది ఎవరి కోసం ఎందుకోసం నిర్మించిన వారికి గాని మంజూరు చేసిన వారి కైనా తెలియదనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇదే స్థలంల వసతి గృహం ఉండేదని అది శిథిలావస్థకు చేరగా దాని స్థానంలో నిర్మించారు. లక్షల ఖర్చు చేసి ఈ భవనం నిర్మించారు. ప్రస్తుతం బుడితి హై స్కూల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నందున ఇదే భవనంలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించి బాలికల కోసం ఇక్కడ వసతి గృహాన్ని మంజూరు చేస్తే ఇటు పిల్లల అభివృద్ధి అటు పాఠశాల అభివృద్ధి జరుగుతుందని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన...

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో ఉన్న పోలవరం గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించే దిశగా స్టూడెంట్ ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థి దశలోనే సార్వత్రిక ఎన్నికలు ఎలా జరుగుతాయో విద్యార్థులకు తెలియజేయాలనే నేతృత్వంతో స్కూల్ పీపుల్ లీడర్ మరియు అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నికలను నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విలియమ్స్ తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికలలో నాయకులు ఎలా నిల్చుంటారో అలాగే స్కూల్లో విద్యార్థుల మధ్య పోటీ చేసే వారు నిలబడి విద్యార్థులతో తాము చేసే పనులు సంవత్సరం అంతా ఎలా ఉంటాము అనే దిశగా హామీలు ఇస్తూ సాగిన కార్యక్రమం గురువారం నాడు ఎన్నికలు మరియు ఫలితాలు దిశగా నిర్వహించడం జరిగింది. ఎన్నికల్లో నిలుచున్న అభ్యర్థుల నుండి కే మణికంఠ అనే అభ్యర్థి ఎస్ పి ఎల్ గా పోటీ చేసి విద్యార్థులు వేసిన ఓట్లలో రెండు ఓట్లతో గెలవగా, ఏ ఎస్ పి ఎల్ గా పోటీ చేసిన అభ్యర్థుల నుండి జి జస్వంత్ విజేతలుగా నిలిచి పాఠశాల ఉపాధ్యాయుల అభినందనలు అందుకున్నారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం రామయ్యపట్నం తీర గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు నిట్ట గోపాల్ గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో గొడుగులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నగిరి మోహనరావు, టీడీపీ నేత మద్దు రాజారావు, నిట్ట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థిని ఢీకొన్న మైనర్‌లు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పోలీసులు ఒక వైపు తనిఖీలు నిర్వహిస్తున్నా మరో వైపు మైనర్‌లు వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతూ ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ముగ్గురు మైనర్లు ర్యాష్ గా ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ఓ విద్యార్థిని ఢీ కొట్టారు. ఆమెకి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం స్థానికులు రిమ్స్ కి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని మితిమీరిన వేగంతో నడిపిన యువకులకు అక్కడ ఉన్నవారు దేహశుద్ధి చేశారు. రద్దీమార్గంలో మితిమీరిన వేగంతో వాహనాన్ని ట్రిపుల్ రైడింగ్ తో నడపడం చాలా సర్వసాధారణమైపోయింది. పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ పెడచెవునపెడుతున్నారు. ఈ ప్రమాధ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌తోపాటు మైనర్ల డ్రైవింగ్ పై పోలీసులు నిఘాను మరింత పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

సిఆర్‌జెడ్ పర్యావరణ పరిరక్షణ అభిప్రాయ సేకరణ పై అభ్యంతరం

విశాలాంధ్ర-కవిటి: సిఆర్‌జెడ్ పర్యావరణ పరిరక్షణ అభిప్రాయసేకరణ పై అభ్యంతరం తెలుపుతూ ఇచ్చాపురం, కవిటి, సోంపేట మండలాల మత్స్యకార సంఘ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ కు మత్స్యకార సంఘ డైరెక్టర్ గంతి శ్రీనివాసరావు తో మత్స్యకార సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు డిఎఫ్‌సిఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఆర్ జెడ్ అభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటుపై మత్స్యకారులకు అందిన సమాచారం సంతృప్తిగా లేదని అన్నారు. సి ఆర్ జెడ్ నోటిఫికేషన్ మరియు కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ అంశాలపై తీర ప్రాంత మత్స్యకారు గ్రామాలలో భవిష్యత్తులో ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఈ సమావేశానికి హాజరు అయ్యాక తెలిసిందని అన్నారు. స్థానికంగా ఉండే మత్స్యకారుల జీవన మనుగడకు వేట విషయంలో అవకాశం కోల్పోయే పరిస్థితి ఉన్నందున సి ఆర్ జెడ్ పై పూర్తిగా మత్స్యకార గ్రామాల్లో అవగాహన కల్పించేంతవరకు ప్రస్తుతం ఈ సేకరణ సమావేశంలో సి ఆర్ జెడ్ ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వినతి అందజేసిన వారిలో కర్రీ ఢిల్లీసు, మాగు పిల్లి పురుషోత్తం, బైబిల్ మోహనరావు , కోడ జానకిరావు, మధు జోగారావు, వారధి పురుషోత్తం, ఉప్పాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎంపీడీవో రాజారావుకి కార్మిక సంఘం నాయకుల వినతి

విశాలాంధ్ర-నందిగాం: తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎస్సీ కాలనీలో తాగునీటికీ చాలా ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు దాలయ్య, యశోద, మహాలక్ష్మి లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రాజారావుకి గురువారం వినతి పత్రం కూడా అందజేశారు. కాలనీలో 7 పైపులైన్లు ఉన్నాయని అందులో నాలుగు పనిచేయడం లేదని వినతలో పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పని సరిగా ధరించాలి

విశాలాంధ్ర -వలాన: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్, సివిల్ జడ్జ్ యు.మాధురి అన్నారు. గురువారము సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణ ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ కలిగి ఉంటే ప్రమాదం జరిగిన ప్రాణాలు కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.